వెంగళరావు సాగర్ ప్రాజెక్ట్

అలుగు నిర్మాణానికి కృషి చేస్తా

శాసన సభ్యుడు జారే ఆదినారాయణ

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

చంద్రుగొండ, డిసెంబర్18: మండల పరిధిలోని వెంగళరావుసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన అలుగు నిర్మాణానికి కృషి చేస్తానని శాసన సభ్యుడు జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం ఆయన సీతాయి గూడెంలోని ప్రాజెక్ట్‌ను పరిశీలించి మాట్లాడారు. ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పర్యటనలో ఎంపీపీ బానోత్ పార్వతి, నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మాలోత్ భోజ్యనాయక్, సారేపల్లి శేఖర్, రామారావు పాల్గొన్నారు.

క్రీడాకారుల యూనిఫాం ఆవిష్కరణ..

దమ్మపేట రూరల్, డిసెంబర్ 18: అంకంపాలేనికి చెందిన కోండ్రు శ్రావణ్ అనే దాత మండలానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు యూనిఫాం సమకూర్చారు. వాటిని గండుగులపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్కలగండి సర్పంచ్ కొర్సా సాగర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 18: పెంట్లం గ్రామానికి చెందిన తుమ్మల వెంకన్న(48) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. వెంకన్న మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన వెంట నాయకులు వెంకటేశ్వరరావు, భీముడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్యకు తీవ్రగాయాలు

దమ్మపేట రూరల్, డిసెంబర్ 18: రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ముష్టిబండ గ్రామ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లగూడెం గ్రామానికి చెందిన రామళ్ల వెంకటేషు (65) సోమవారం భార్య అనసూయతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో సత్తుపల్లి వైపు నుంచి వాహనాన్ని వడ్లగూడెం రోడ్డుకు తిప్పుతుండగా ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొట్టింది. ఘటనలో వెంకటేషు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య అనుసూయకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులరాలిని ఓ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు.

గుండెపోటుతో బీట్ ఆఫీసర్ మృతి

దమ్మపేట రూరల్, డిసెంబర్ 18: దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ మల్కారం బీట్ ఆఫీసర్ సున్నం తిరుపతిరావు ఆదివారం స్వల్ప ఆనారోగ్యానికి గురయ్యారు. దీంతో సత్తుపల్లిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. సోమవారం ఆయన గుండెపోటుకు గురయ్యారు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు సత్తుపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తిరుపతిరావు మృతిచెందారు. మృతుడి కుటుంబానికి రేంజర్ శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.

'మా ప్రాంతంలో టోల్‌గేట్ వద్దు'

టేకులపల్లి, డిసెంబర్ 18: నేషనల్ హైవే-930పీ నిర్మాణంలో భాగంగా మండల పరిధిలోని సులానగర్ -సీతారాంపురం మధ్య టోల్ గేట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు భూసేకరణకు అడుగులు పడుతున్నాయి. దీంతో సులానగర్‌తోపాటు పంచాయతీ పరిధిలోని రాజుతండా, చింతలంకకు చెందిన పలువురు రైతులు సోమవారం కొత్తగూడెం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లారు. టోల్ గేట్‌ను వేరే ప్రాంతానికి మార్చకపోతే తాము నష్టపోతామని వినతి పత్రం అందించారు. అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డీఆర్వో రవీందర్ వెంటనే స్పందించి సమస్యను కలెక్టర్ ప్రియాంక ఆల తోపాటు నేషనల్ హై వే అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సదరం క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

టేకులపల్లి, డిసెంబర్ 18: సదరం సర్టిఫికెట్ పొందని దివ్యాంగుల కోసం ఈ నెల 20 నుంచి 29 వరకు జిల్లాకేంద్రంలో సదరం క్యాంప్ జరుగుతుందని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వీరబాబు సోమవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. క్యాంపునకు హాజరయ్యేందుకు ముందుగా మీ సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసకోవాల్సి ఉంటుందని సూచించారు.

నూతన ఓసీ ఏర్పాటుకు సహకరించండి

ఎమ్మెల్యే కనకయ్యను కోరిన సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 18: సింగరేణి ఇల్లెందు ఏరియా మనుగడకు సంస్థ ఏర్పాటు చేయనున్న ఓపెన్ కాస్ట్‌కు సహకరించాలని ఏరియా జీఎం జాన్ ఆనంద్ సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఇల్లెందు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కోరారు. ఓసీ అందుబాటులోకి వస్తే ఇల్లెందుకు పూర్వవైభవం వస్తుందన్నారు. ఆనంతరం జేకే ఓసీ ప్రాజెక్ట్ పరిధిలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యేకు వివరించారు. వారి వెంట సంస్థ ఎస్టేట్ అధికారి శివకుమార్, మున్సిపల్ చైర్మన్ దమ్మాల పాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

ఇల్లెందు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం 97 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరారావు, ఎంపీపీ చీమాల నాగరత్నమ్మ పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో బాలరాజు, పలువురు పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే కనకయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్

సమష్టిగా పనిచేద్దాం.. సమస్యలు పరిష్కరిద్దాం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 18 : సమష్టిగా పని చేసి ప్రజా సమస్యలను పరిష్కరించుకుందామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో కౌన్సిలర్ల బృందం ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, అందరం కలిసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, కౌన్సిలర్లు బండి నర్సింహారావు, రుక్మాంగధర్ బండారి, పల్లపు లక్ష్మణ్, అంబుల వేణుగోపాల్, కౌడగాని పరమేశ్‌యాదవ్, వేముల ప్రసాద్‌బాబు, కోలాపురి ధర్మరాజు, బీఆర్ఎస్ నాయకులు ఎంఎ రజాక్, బాలశెట్టి సుందర్‌రాజు, గుమ్మడెల్లి దుర్గ, మాదా శ్రీరాములు, తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేను కొత్తగూడెం డీఎస్పీ ఎంఎ రహమాన్, పోలీసు అధికారులు ఎం.కరుణాకర్, టి.రమేశ్, ఖాజామోహినుద్దీన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ రెహమాన్, పోలీస్ సిబ్బంది

వీధి వ్యాపార సముదాయాలను అద్దెకిస్తే ఊరుకోం..

ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి

ఇల్లెందు, డిసెంబర్ 18: పట్టణ పరిధిలోని వీధి వ్యాపారుల సముదాయాలను ఎవరైనా ఇతరులకు అద్దెకిస్తే ఊరుకునేది లేదని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం ఆయన మెయిన్‌రోడ్ హైస్కూల్‌ను ఆనుకొని ఉన్న వీధి వ్యాపార సముదాయాలను ఆయన పరిశీలించి వ్యాపారులతో మాట్లాడారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై కొందరు కోర్టును ఆశ్రయించారని, కేసు పెండింగ్ ఉండడంతో కొందరు సముదాయాలను ఆక్రమించుకున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని కిరాయికి ఇచ్చి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిజమైన వీధి వ్యాపారులకు త్వరలో సముదాయాలను కేటాయిస్తామన్నారు. అలాగే షాపులు కిరాయికి తీసుకుని, షాపులు నడపకుండా ఉన్న వాటిని ఇతరులకు కేటాయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కూరగాయల మార్కెట్ సమీపంలో రూ.8 కోట్లతో నిర్మించిన మోడల్ మార్కెట్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి

క్రీడలతో మానసికోల్లాసం

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 18: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సింగరేణి ఇలెలదు ఏరియా సీనియర్ పర్సనల్ అధికారి సాయిస్వరూప్ అన్నారు. ఏరియా పరిధిలో సోమవారం ఆయన మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగ జీవితంలో ఒత్తిడిని క్రీడలతో అధిగమించవచ్చన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన క్రీడకారులకు ఈనెల 23న నిర్వహించే సింగరేణి డేలో ఏరియా జీఎం జాన్ ఆనంద్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు.

స్వచ్ఛంద సంస్థకు ఆర్థిక సాయం

జూలూరుపాడు, డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని సాయి ఎక్స్‌లెంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం హార్ట్‌బీట్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సోమవారం పాఠశాలలో రూ.8 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారదాదేవి, కరస్పాండెంట్ ఆరెబోయిన కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వీపర్లకు గౌరవవేతనం అందించాలి

జూలూరుపాడు, డిసెంబర్ 18 : పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు గౌరవవేతనం అందజేయాలని బహుజన కార్మిక విభాగం నాయకుడు తంబర్ల నర్సింహారావు కోరారు. మండల కేంద్రంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వీపర్లు భూక్యా సాలి, నూనావత్ లక్ష్మణ్, వట్టం కృష్ణయ్య, పాయం శేషమ్మ, ప్రేమమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అశ్వారావుపేట, డిసెంబర్ 18: దమ్మపేటకు చెందిన రాజులపాటి మల్లయ్య ఇటీవల తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలై ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న గౌడ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం బాధితుడికి రూ.10 వేల తక్షణ సాయం అందించారు. సాయం అందించిన వారిలో సంఘం మండల అధ్యక్షుడు పానుగంటి చిట్టిబాబు, నాయకులు యార్లగడ్డ బాబు, బంధం శ్రీనివాసరావు, శ్రీను, పానుగంటి కృష్ణ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ తప్పనిసరి

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ తప్పనిసరిగా సమయానుకూలంగా నిర్వహించాలని కొత్తగూడెం సీడీపీవో స్వర్ణలత లెనీనా తెలిపారు. సోమవారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ప్రాజెక్టు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉదయం 9 గంటలకే అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, హెల్పర్లు వచ్చి పిల్లలను కేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. టీచింగ్ లెర్నింగ్‌మెటీరియల్(టీఎల్ఎం) ద్వారా పిల్లలకు ఆటపాటలు నేర్పించాలన్నారు. ప్రతి రోజు సూపర్‌వైజర్లు కేంద్రాలను తనిఖీ చేసి రిపోర్ట్‌ను వాట్సాప్ ద్వారా అందించాలన్నారు. గ్రోత్ మానిటరింగ్ ప్రతి నెల 3 తేదీకల్లా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పతి అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రీస్కూల్ పాఠాలు వినేందుకు ఎల్ఈడీ టీవీలను మంజూరు చేశారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ప్రతి సెంటర్‌కు ఒక టీవీని అందజేశారు. నేటి నుండి ఆయా కేంద్రాల్లో టీశాట్ ద్వారా కార్యక్రమాలు వీక్షించనున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 18 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని 1969 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సమరయోధుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శాంతిరాం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణంలోని కూలీలైన్‌లో జరిగిన ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 250గజాల ఇంటిస్థలం, పెన్షన్ ఇవ్వాలని సూచించారు.

ఆలయానికి భూమి అప్పగింత

జూలూరుపాడు, డిసెంబర్ 18 : మండల పరిధి కాకర్ల సమీపంలోని రుక్మిణీసమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయానికి కొత్తగూడెం పట్టణ సమీపంలోని విద్యానగర్‌కాలనీకి చెందిన మరీది నరసయ్య-వెంకాయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు గంగాధర్-సరిత దంపతులు 20 గుంటల భూమిని సోమవారం అప్పగించారు. ఆలయంలో నిత్య పూజల సమయంలో వాడే పూల మొక్కలు పెంచేందుకు భూమి విరాళం ఇస్తున్నట్లు ఆలయ కమిటీకి తెలిపారు.

కోట మైసమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

జూలూరుపాడు, డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని జూలూరుపాడు సమీపంలోని పాపకొల్లు రోడ్డు పక్కన ఉన్న శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి నూతన దుస్తులు, పూలు, పండ్లు, గాజులతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అభిషేకాలు, అన్నదానం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి

చుంచుపల్లి, డిసెంబర్ 18 : మండలంలోని గౌతంపూర్ పంచాయతీ శ్రీకనకదుర్గ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

నామవరంలో..

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 18: నామవరం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా అర్చకులు ఘనంగా స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 18: సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని శివాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగాలకు అభిషేకం చేశారు. కోనేరు శివాలయంలో నిర్వాహకులు భక్తులకు అన్నసమారాధన చేపట్టారు.